క్లుప్తంగా

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ పిట్టల సంపత్

హుస్నాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ సర్పంచ్ పిట్టల సంపత్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రిని కలిసినట్లు చెప్పారు. మహ్మదాపూర్ సర్పంచ్‌గా రెండు పర్యాయలు గెలుపొందినట్లు తెలిపారు. గ్రామ సమస్యలను మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పట్టించుకోలేదని, ఎంపీపీతో అధికారులపై ఒత్తిడి తెచ్చి గ్రామ పరిపాలనలో ఇబ్బందులు కలిగించడంతో విరక్తి చెంది కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. మండలంలో మరికొంత మంది సర్పంచ్‌లు కూడా పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

హమాలీలకు ఉచిత వైద్య పరీక్షలు



బీపీ పరీక్ష చేస్తున్న వైద్యురాలు

హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం మేరకు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం అంబేద్కర్, ఆదర్శ హమాలీ కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినందుకు కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, అంబేద్కర్ హమాలీ సంఘం అధ్యక్షుడు పున్న రాజమౌళి, కార్మికులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి

తొగుట(దుబ్బాక): అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22వ తేదీన సెలవు ప్రకటించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కులమతాలకతీతంగా ప్రజలు పాల్గొంటారన్నారు. రాజకీయాలకతీతంగా దేశ ప్రజలు జరుపుకునే గొప్ప పండగన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మర్కూక్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ గుప్త అన్నారు. శనివారం మండలంలోని గంగాపూర్– యూసుఫ్‌ఖాన్‌పల్లి, మర్కూక్ గ్రామాల్లో ఏపీజీవీబీ మేనేజర్ నర్సింహులు, మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సురక్ష బీమా, జీవన జ్యోతి, అటల్ పెన్షన్, సుకన్య సమృద్ధి యోజన, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, గ్రామ కార్యదర్శి మౌన, ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ మాధురి, బ్యాంక్ మిత్ర మహేశ్వరీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని రంగంపేటలో మృతి చెందిన బోనగిరి అనూష కుటుంబ సభ్యులను గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్ శనివారం పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిస్తూ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచనల మేరకు రూ.5 వేలు, గ్రామ యువత రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేష్‌గౌడ్, దుర్గారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాగరాజు, మనోహర్ పాల్గొన్నారు.

'బైండోవర్ ఉల్లంఘనలో జరిమానా'

అక్కన్నపేట(హుస్నాబాద్): బైండోవర్ ఉల్లంఘించడమేకాకుండా మళ్లీ నేరానికి పాల్పడిన వ్యక్తికి ఎక్సైజ్ పోలీసులు జరిమానా విధించారు. శనివారం ఎక్సైజ్ సీఐ పవన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మంజ్యానాయక్ తండాకు చెందిన ముడావత్ తిరుపతి నాటుసారా సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. గతంలో ఇతడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసారా సరఫరా చేస్తూ పట్టుబడటంతో రూ.50 వేల జరిమానా విధించారు. ఎవరైన బైండోవర్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

హుస్నాబాద్‌రూరల్: ఓటరు నమోదుకు ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం పోతారం (ఎస్)లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఆదివారం ఆయా గ్రామాల్లో బీఎల్వోలు గ్రామ పంచాయతీ వద్ద ఓటరు నమోదుకు దరఖాస్తులు తీసుకుంటారన్నారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా మార్పు చేసుకోవడానికి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు అందుబాటులో ఉండాలన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి..

బెజ్జంకి(సిద్దిపేట): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయాలని బెజ్జంకి తహసీల్దార్ శ్యాం సూచించారు. మండలంలోని దాచారం, బెజ్జంకి క్రాసింగ్, తోటపల్లి తదితర గ్రామాలలో ఓటరు నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 5 గంటల వరకు పోలింగ్ బూతులలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

మిరుదొడ్డి(దుబ్బాక): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గోవర్ధన్ సూచించారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శనివారం బూత్‌లెవల్ అధికారులతో కలిసి యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫహీం, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, రేణుక, పున్నమ్మ, బుజ్జమ్మ రేణమ్మ పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ఓటరు నమోదు శిబిరాల సందర్శన

రాయపోలు(దుబ్బాక): మండలంలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను శనివారం తహసీల్దార్ దివ్య, ఎంపీడీఓ మున్నయ్య సందర్శించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన కరపత్రాలను ప్రదర్శించారు. శని, ఆదివారాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను 18 ఏళ్ల నిండిన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కొత్తపల్లిలోని ఓటరు నమోదు శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాతీర్పును గౌరవించాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర నేత సర్దార్‌ఖాన్

గజ్వేల్: ప్రజా తీర్పును గౌరవించకుండా బీఆర్‌ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని యువజన కాంగ్రెస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ మండిపడ్డారు. శనివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మితిమీరిన అహంకారం ప్రదర్శించడం వల్లే బీఆర్‌ఎస్ ఓటమిపాలైందన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాల్సింది పోయి ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ విధానాన్ని ప్రజలు హర్షించరన్నారు. ప్రజా ఉద్యమాలను అణిచివేసి, మీడియా గొంతు నొక్కి బీఆర్‌ఎస్ అరాచక పాలన సాగించిన విషయం ప్రజలు మరిచిపోలేదన్నారు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో తాము గెలుస్తామంటూ బీఆర్‌ఎస్ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని, కాంగ్రెస్ పక్షానే ప్రజలు నిలబడి తమ పార్టీ అభ్యర్థినే గెలిపిస్తారన్నారు. సమావేశంలో అజ్గర్, సుదర్శన్, సమీర్, గణేష్, బాలాగౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న సర్దార్‌ఖాన్

నవోదయ సీటు లక్ష్యంగా శిక్షణ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వింజపల్లి పరిధి పెరుకలగడ్డ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాలుగు నెలలుగా ప్రధానోపాధ్యాయుడు రవివర్మ నవోదయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో సైనిక్ స్కూల్, గురుకుల, నవోదయ స్కూల్స్‌కు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు చదువులో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు.

బహుమతుల అందజేత



బహుమతులను అందజేస్తున్న సర్పంచ్

మద్దూరు(హుస్నాబాద్): సంక్రాంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని రామాలయ యూత్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందాద్ జట్టుకు మొదటి బహుమతి కింద రూ.4 వేల నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి కింద రూ.3 వేల నగదు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, బహుమతుల దాత, హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఖాజా అరీఫ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేత

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై అక్రమంగా ప్రహరీ నిర్మించారంటూ శనివారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. 12 వార్డు రాఘవేంద్రనగర్ కాలనీ లో ఓ మహిళ ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్ నుంచి అనుమతి తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ప్రహరీ నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు నోటీసు జారీ చేశారు. నోటీసుకు స్పందించకపోవడంతో మున్సిపల్ నిబంధనల మేరకు కూల్చినట్టు అధికారులు తెలిపారు. కాగా బీఆర్‌ఎస్ నాయకుడికి గతంలో రూ.2 లక్షలు లంచం ఇచ్చామని, మరికొంత ఇవ్వకపోవడంతో మున్సిపల్ సహకారంతో కూల్చివేతకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వకపోతే ఇల్లును కూల్చివేస్తారా? ఇదెక్కడి న్యాయమన్నారు.



ప్రహరీని కూల్చిన దృశ్యం

22న సామూహిక రామనామ జపం

మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాక టౌన్: శ్రీరాముడి జన్మభూమి అయోధ్యలో ఈనెల 22వ తేదీన బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దుబ్బాకలో బాలాజీ ఆలయంలో చేపట్టిన 108 సామూహిక రామనామ జపంలో ప్రజలు పాల్గొనాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత పిలుపు ఇచ్చారు. శనివారం తెలంగాణ తిరుమల దుబ్బాక బాలాజీ ఆలయం వద్ద ఆలయ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, వీహెచ్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికి కాషాయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని అన్ని ఆలయాల్లో భజనలు, కీర్తనలు, సామూహిక రామ నామ జపాలు చేయాలన్నారు.



దుబ్బాక బాలాజీ ఆలయం వద్ద కాషాయ జెండాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ గన్నె వనిత

దేవాలయాలను శుద్ధి చేసిన నాయకులు



హుస్నాబాద్‌లోని మరకత లింగేశ్వర స్వామి దేవాలయాన్ని శుద్ధిచేస్తున్న ఆకుల రజిత

హుస్నాబాద్: అయోధ్యలో శ్రీ రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా హుస్నాబాద్‌లోని పలు దేవాలయాలను శుద్ధి చేశారు. శనివారం పట్టణంలోని కాశీ మరకత లింగేశ్వర ఆలయాన్ని మున్సిపల్ పాలకవర్గం, హనుమాన్ దేవాలయాన్ని బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమంలో భాగంగా ఆలయాలను శుభ్రం చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు వల్లపు రాజు, బోజు రమాదేవి, వాల సుప్రజ, స్వర్ణలత, గోవిందు రవి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తిరుమల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం

గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్

వర్గల్(గజ్వేల్): బాల్యవివాహాలు చేయడం నేరమని, బడీడు పిల్లలను చదువుకోనివ్వాలని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ అన్నారు. శనివారం వర్గల్ జెడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం జరిపించాలని సూచించారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే తల్లిదండ్రులకు శిక్షపడుతుందని హెచ్చరించారు. సమావేశంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వర్గల్ హైస్కూల్‌లో ప్రసంగిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: మహిళల చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ అన్నారు. శనివారం పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, అత్యాచారాల కేసుల్లో చట్టపరంగా విధించే శిక్షల గురించి వివరించారు. పోక్సో, సోషల్ మీడియాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు హరితారెడ్డి, కె. సౌమ్య, వాసవి, మమత తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా ప్రతినిధులు

జాయ్ అలుక్కాస్ బిగ్ జ్యూయలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



గజ్వేల్‌లో జాయ్ అలుక్కాస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: జాయ్ అలుక్కాస్ బిగ్ జ్యూయలరీ ఎగ్జిబిషన్ గజ్వేల్‌లో ప్రారంభమైంది. పట్టణంలోని ముట్రాజ్‌పల్లి రోడ్డులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడ్రోజుల పాటు జాయ్ అలుక్కాస్ బిగ్ జ్యూయలరీ ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. ప్రతీ ఆభరణంపై ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయ్ అలుక్కాస్ స్టోర్ మేనేజర్ నారాయణ్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి క్రికెట్ పోటీలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో సిబ్బందికి శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేఖ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురవుతున్న వారికి ఇటువంటి పోటీలు నిర్వహిస్తే కొంత ఉపశమనం లభించడంతో పాటు ఉత్సాహంగా ఉంటారన్నారు. టోర్నమెంట్‌లో మెకానికల్ సిబ్బందిపై డ్రైవర్లు, కండక్టర్ల జట్టు గెలుపొందారు. విజేతలకు జనవరి 26వ తేదీన బహుమతులను ప్రధానం చేయడం జరుగుతుందని డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో జీపీపీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ కనకలక్ష్మి, మెకానికల్ సూపర్‌వైజర్ జమీల్, ఆఫీస్ సూపర్‌వైజర్ పాల్, సివిల్ ఇంజినీర్ నాగేందర్, అకౌంట్స్ ఆఫీసర్ జనార్ధన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉచిత విద్యపై అవగాహన

దుబ్బాకరూరల్: దుబ్బాక ప్రభుత్వ కళాశాల లెక్చరర్లు మండలంలోని ఆకారం, ఎనగుర్తి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పది పాసైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరితే ప్రభుత్వం ఉపకార వేతనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తుందన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన ఉంటుందన్నారు. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఉచితంగా సీటు వస్తుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ శివకుమార్, సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

దాతల సహకారం అభినందనీయం

అంగడి కిష్టాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణ

మర్కూక్ (గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అంగడి కిష్టాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మూడో శనివారం పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ జూనియర్ లైన్‌మెన్ నరేష్ పాఠశాలకు రూ.10 వేల నగదు, మూడు ఫ్యాన్లు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. నరేష్ కూతురు ఇదే పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. మంచి విద్యనందిస్తున్న ఉపాధ్యాయులను ప్రసంసించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, హారిక, చిన్నికృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గజ్వేల్: ఈనెల 22 నుంచి 27 వరకు మండల స్థాయిలో, ఫిబ్రవరి 3న జిల్లాస్థాయిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. శనివారం పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ సునీత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి టాలెంట్ టెస్ట్‌ల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి పి.నర్సింహులు, పీఆర్టీయూ గజ్వేల్ మండల అధ్యక్షుడు వేమారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ వ్యాపారులకు అనుమతి ఇవ్వొద్దు

వంటిమామిడి వ్యాపారుల డిమాండ్

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడిలో మార్వాడీ వ్యాపారుల దుకాణాలు పెరగడంతో తమకు ఉపాధి తగ్గుతోందని, ఇకపై వారికి అనుమతులు ఇవ్వకుండా గ్రామ పంచాయతీ చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యాపారులు శనివారం ఆందోళనకు దిగారు. గడిచిన నాలుగేళ్లలో సుమారు 25 మంది మార్వాడీలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వంటిమామిడిలో స్థిరపడి వ్యాపారాలు చేస్తుండటంతో తాము నష్టపోతున్నామని చైతన్య వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు జహంగీర్, ఉపాధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి యాదగిరి ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేపట్టిన వ్యాపారులతో సర్పంచ్ హంస, వీడీసీ చైర్మన్ మహేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత మాట్లాడారు. అనంతరం మార్వాడీ వ్యాపారులను పిలిచి ప్రస్తుతం ఉన్నవారు మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని కొత్తవారు వ్యాపారాలు చేయొద్దని సూచించారు. అందుకు మార్వాడీలు అంగీకరించారు.

సంక్షిప్త వార్తలు

◆ అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభం

సిద్దిపేటకమాన్: పట్టణంలోని 35వ వార్డులో వీరశైవలింగ బలిజ సమాజం అదనపు గదుల నిర్మాణ పనులను సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, వీరశైవ బలిజ సమాజ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

దుబ్బాకరూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని డీబీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రాజక్కపేట, లచ్చపేటలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్‌శేఖర్ తెలిపారు. వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు 26వ తేదీన బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

◆ బీజేపీ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు

వర్గల్(గజ్వేల్): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గంగాడి మోహన్‌రెడ్డిని శనివారం బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం మహిపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ వర్గల్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.

◆ విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే

సిద్దిపేటజోన్: విద్యార్థికి చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వివేకానంద, చంద్రబోస్ జయంతి సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించారు.

◆ కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

కొమురవెల్లి(సిద్దిపేట): నియోజక వర్గ కురుమ సంఘం నూతన కమిటీని కొమురవెల్లిలో రాష్ట్ర నాయకులు అందె బీరయ్య, మీసా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఓరుగంటి శంకర్, ప్రధాన కార్యదర్శి అందె నాని, కార్యదర్శిగా జంగిటి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా సూర్న శ్రీశైలం, కోశాధికారిగా బండారి కనకయ్య, సహాయ కార్యదర్శిగా ఆత్కూరి జయరాములు, సలహాదారులుగా దయ్యాల రాజు, బింగి రాములు, మీస సత్యనారాయణ, బండారి సత్తయ్య, మేక యాదగిరి, నంగి చంద్రమౌళి ఎన్నికయ్యారు.

◆ సమస్యలను పరిష్కరించాలి

కొండపాక(గజ్వేల్): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా నాయకుడు భాకి చంద్రభాను కోరారు. మండల పరిధి దుద్దెడలోని హైస్కూల్లో 2024 క్యాలెండర్‌ను హెచ్‌ఎం లక్ష్మీతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

◆ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా లక్ష్మణ్

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన కొమ్ముగల్ల లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ ప్రీతమ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ రామ మందిర కరసేవకులకు సన్మానం

చేర్యాల(సిద్దిపేట): రామ మందిర నిర్మాణం కోసం చేర్యాల ప్రాంతం నుంచి కరసేవలో పాల్గొన్న మేక బాలసిద్దయ్య, ఆయిత ఉదయ ప్రకాష్, అంకుగారి శశిధర్‌రెడ్డి, బూరుగు కనకయ్యను రామాలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈనెల 22న అయోధ్యలో జరిగే బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని శనివారం రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు.